ఎస్బీఐ లైఫ్
నూతన శాఖ ప్రారంభం

సాక్షి, సిటీబ్యూరో: జీవిత బీమా పాలసీదారులకు సేవల్ని విస్తరించడంలో భాగంగా ప్రముఖ జీవిత బీమా సంస్థ ఎస్‌బీఐ లైఫ్ తమ నూతన శాఖను సికింద్రాబాద్‌లోని పద్మారావునగర్‌లో ఏర్పాటు చేసింది. దీనిని గురువారం ఎస్బీఐ లైఫ్ ఇన్సూరెన్స్ తెలంగాణ ప్రాంతీయ డైరెక్టర్ అభిషేక్ కర్ మజుందార్ ప్రారంభించారు. కొత్త బ్రాంచ్ ఆఫీస్‌లో పాలసీ జారీ సర్వీసింగ్, ప్రీమియం పునరుద్ధరణలు క్లెయిమ్‌లకు సహకారం తదితర సేవలు లభిస్తాయని ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధులు తెలిపారు. కార్యక్రమంలో ఏజెన్సీ ఆర్‌ఎమ్ పి.వంశీధర్‌రెడ్డి, డీఆర్ ఎంఎస్‌ఎం బి.సాయిబాబా పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి

గాంధీఆస్పత్రి: జీవకోటి మనుగడ కోసం, భవిష్యత్ తరాలకు ఆరోగ్యవంతమైన వాతావరణాన్ని అందించేందుకు ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని పరిరక్షించాలని గాంధీఆస్పత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ సీహెచ్‌ఎస్ రాజకుమారి అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం గాంధీఆస్పత్రి ప్రాంగణంలో మొక్కలు నాటి పలు అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. కేన్సర్, చర్మ వ్యాధులు, లీవర్ సంబంధిత రుగ్మతలకు కారణమైన ప్లాస్టిక్‌ను నిషేధించాలన్నారు. అనంతరం వైద్యులు, వైద్య విద్యార్థులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు.

కులగణనను ప్రారంభించండి

ఉస్మానియా యూనివర్సిటీ: దేశంలో ఈ ఏడాది నుంచే కులగణనను చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగంగౌడ్ డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఓయూలో మాట్లాడుతూ.. 2027 మార్చి 17న కులగణన షెడ్యూల్ ప్రకటించడాన్ని బీసీ సంక్షేమ సంఘం తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. త్వరలో జరగబోయే తమిళనాడు, బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని కేవలం ఓట్ల కోసం 2027లో కేంద్రం కులగణన చేపడితే సహించేది లేదన్నారు. బీసీల ప్రయోజనం కోసం కులగణన చేపట్టాలని బీజేపీ పార్టీ ఎన్నికల్లో లబ్ధిపొందేందుకు కాదన్నారు. బీసీల అభివృద్ధిపై చిత్తశుద్ధి ఉంటే షెడ్యూల్‌ను సవరించి ఈ ఏడాది నుంచే కులగణన ప్రారంభించాలన్నారు.

గురుకుల ఉద్యోగులను తొలగించడం అన్యాయం

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్రవ్యాప్తంగా ఎస్సీ గురుకులాల్లో పనిచేస్తున్న ఉద్యోగులను అకారణంగా తొలగించడం అన్యాయమని తెలంగాణ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తల్లమల్ల హసేన్ గురువారం పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ ఎస్సీ గురుకులాలల్లో పదేళ్లుగా పనిచేస్తున్న 240 మంది తాత్కాలిక ఉద్యోగులను హఠాత్తుగా తొలగించడం వలన వారి కుటుంబాలు వీధిన పడ్డాయని సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. డిగ్రీ, బీఈడీ, పీజీ తదితర ఉన్నత విద్యార్హతలు ఇంటర్వ్యూలలో సాధించిన మెరిట్ ద్వారా ఉద్యోగాల్లో నియమించారని వివరించారు. ఎస్సీ గురుకులల్లో హాస్టల్ వార్డెన్లుగా, కేర్‌టేకర్లుగా, ఇతర ఉద్యోగులలో నియమితులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ పేద కుటుంబాలకు చెందిన ఉద్యోగులను పర్మనెంట్ చేయకుండా శాశ్వతంగా ఉద్యోగాల నుంచి తప్పించడం అత్యంత బాధకరమన్నారు. తొలగించిన ఉద్యోగులను తిరిగి తీసుకోవాలని సీఎంను కోరినట్లు చెప్పారు.

నేటి నుంచి బడిబాట

ప్రభుత్వ పాఠశాలల్లో నుంచి ప్రవేశాలకు శ్రీకారం

సికింద్రాబాద్: వేసవి సెలవుల విరామం అనంతరం పాఠశాలల్లో తరగతులు ఈనెల 12 నుంచి ప్రారంభం కానున్నాయి. కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం అవుతున్న నేపథ్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచడం కోసం అధికారులు కార్యాచరణ సిద్ధం చేసుకున్నారు. బడిబాట పేరుతో ప్రభుత్వ ఉపాధ్యాయులు ఆయా పాఠశాలల పరిధిలోని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ పాఠశాలల్లో చదివించడం ద్వారా విద్యార్థులకు చేకూరే ప్రయోజనాలు వివరించనున్నారు. సికింద్రాబాద్ నగరంలోని నాలుగు మండలాల పరిధిలో 112 ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు ఉన్నాయి. వీటన్నింటిలో గత విద్యా సంవత్సరం వరకు విద్యార్థుల సంఖ్య 19400 మంది ఉన్నారు. ఈ ఏడాది విద్యార్థుల ప్రవేశాల సంఖ్యను మరింతగా పెంచేందుకు 15 రోజుల పాటు బడిబాట కార్యక్రమాలు కొనసాగించనున్నారు.

నేటి నుంచి ర్యాలీలు... కరపత్రాల ప్రచారం

◆ ఉపాధ్యాయులు బృందాలుగా ఏర్పడి బస్తీల్లో బడిబాట కార్యక్రమాలు నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసుకున్నారు. ఈనెల 6 నుంచి పదిహేను రోజుల పాటు బడిబాట కార్యక్రమాలు కొనసాగించనున్నారు. బస్తీలు, బడుగు, బలహీనవర్గాల ప్రజలు నివసించే ప్రాంతాలు ఎంపిక చేసుకుని ఉపాధ్యాయులు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేస్తారు.

◆ కరపత్రాలు పంపిణీ చేయడం, వాల్‌పోస్టర్లు వేయించడం, విద్యార్థులచే ర్యాలీలు నిర్వహించే ఏర్పాట్లు ప్రారంభించనున్నారు. ఇటువంటి కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా ఉపాధ్యాయులు, విద్యాశాఖ అధికారులు ఆశాజనకమైన ఫలితాలు సాధించారు. ప్రత్యేకంగా బడిబాట కార్యక్రమాల ఫలితంగా గత ఏడాది 500 మంది పిల్లల అడ్మిషన్లు పెరిగినట్లు విద్యాశాఖ అధికారులు పేర్కొంటున్నారు.

తల్లితండ్రులకు భరోసా ఇస్తూ..

◆ ప్రభుత్వ పాఠశాల్లో విద్యార్థులను చేర్చుకునేందుకు ముందుగా వారి తల్లితండ్రులను ఒప్పించే విధంగా ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్‌లకు మార్గదర్శక సూత్రాలను వివరించారు. ఉత్తమ ఫలితాలు రాబట్టేవిధంగా భరోసాలు ఇవ్వడం, ప్రభుత్వం నుంచి అందించే పుస్తకాలు, వసతులు తెలియజెప్పడం తదితర అంశాలను వివరించి నమ్మకం పెంచే విధంగా వ్యవహరించే పద్ధతులు తెలియజెప్పారు.

◆ ఇందులో భాగంగా ఈనెల 6న అన్ని పాఠశాలల పరిధిలో గ్రామసభలు నిర్వహిస్తారు. 7న బడిలో చేర్పించేందుకు వయసు వచ్చిన పిల్లలను గుర్తించడం, 8 నుంచి 10వ తేదీ వరకు డ్రాప్‌అవుట్ పిల్లల గుర్తింపు, కరపత్రాల ఇంటింటి ప్రచారం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. 11 నుంచి 18 వరకు బడిబాట సమీక్షలు, పాఠ్య పుస్తకాలు పంపిణీ, సామూహిక అక్షరాభ్యాసాలు, తరగతి గదులు, డిజిటలైజేషన్ వంటి అవగాహన కార్యక్రమాలు కొనసాగిస్తారు. 19న విద్యార్థులకు వివిధ క్రీడాంశాల్లో క్రీడా పోటీలు నిర్వహించి బడిబాట కార్యక్రమాలు ముగిస్తారు.


గురువారం చిలకలగూడలో బడీడు పిల్లల సర్వే నిర్వహిస్తున్న ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయులు

లష్కర్ పాఠశాలలు -విద్యార్థులు

'సికింద్రాబాద్ మండలం	
ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు:	49
విద్యార్థులు:	5,400
'మారేడుపల్లి మండలం	
ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు:	39
విద్యార్థులు:	9,100
'ముషీరాబాద్ మండలం	
ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు:	34
విద్యార్థులు:	4,900

పాఠశాలల్లో వసతులు పెంచాలి



ప్రభుత్వ పాఠశాల్లో వసతులు ఏర్పాటు చేయాలి. కార్పొరేటర్ పాఠశాలలకు దీటుగా సదుపాయాలు ఏర్పాటు చేస్తే విద్యార్థుల సంఖ్యను సులభంగా పెంచవచ్చు. సాధారణ అభివృద్ధి పనులు వేగవంగంగా చేపడుతున్న మాదిరిగానే ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి కోసం పాలకులు, అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలి.

– మల్లికార్జున్‌రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు

విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి



బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయడం కోసం అన్నివిధాల చర్యలు తీసుకున్నాం. ఉపాధ్యాయులు,రిసోర్స్‌పర్సన్లు వ్యవహరించాల్సిన తీరు పట్ల అవగాహన కల్పించాం. ఈ ఏడాది పాఠశాలల్లో అభివృద్ధి పనులు, కంప్యూటర్ తరగతుల ఆధునీకరణ నేపథ్యంలో విద్యార్థుల ప్రవేశాలను గతేడాది కన్నా ఎక్కువ సంఖ్యలు రాబడుతాం.

– శ్రవణ్‌కుమార్, మండలవిద్యాశాఖ అధికారి

పర్యావరణాన్ని పరిరక్షించుకుందాం

రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ


పర్యావరణ అంశాలపై నిర్వహించిన పోటీల్లో విజేతలకు సర్టిఫికెట్లు ప్రదానం చేసిన మంత్రి కొండా సురేఖ

సనత్‌నగర్: పర్యావరణ పరిరక్షించుకుని.. భవిష్యత్ తరాలను కాపాడుకోవాల్సిన అవసరం, బాధ్యత మనందరిపై ఉందని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పేర్కొన్నారు. యావత్ ప్రపంచానికే సవాల్‌గా మారిన ప్లాస్టిక్ మహమ్మారి నిర్మూలనకు తెలంగాణ ప్రభుత్వం, ప్రజలు సంయుక్త కృషి అవసరమని ఆమె అభిప్రాయపడ్డారు. సనత్‌నగర్‌లోని టీజీపీసీబీ కార్యాలయంలో గురువారం జరిగిన అంతర్జాతీయ పర్యావరణ దినోత్సవ వేడుకలకు ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ... పర్యావరణ పరిరక్షణ కోసం కాంగ్రెస్ ప్రభుత్వం 'వన మహోత్సవం' కార్యక్రమాన్ని పెద్ద ఎత్తున చేపడుతోందని గుర్తుచేశారు. గతేడాది 20.2 కోట్ల మొక్కలు నాటాలని లక్ష్యంగా పెట్టుకుంటే 19.4 కోట్ల మొక్కలను నాటామని తెలిపారు. ఇందుకు అటవీ శాఖ అధికారులు, సిబ్బందిని తాను ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లు చెప్పారు.

వన మహోత్సవాన్ని భారీస్థాయిలో చేపడతాం..

ఈ సంవత్సరం కూడా వన మహోత్సవం భారీ స్థాయిలో చేపట్టాలని నిర్ణయించామని తెలిపారు. పర్యావరణ మెరుగు పరిచేందుకు తమ ప్రభుత్వం ఇతర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ఎకో టూరిజం, పార్కుల్లో కీలక మార్పులు చేపడుతున్నామని పేర్కొన్నారు. ప్లాస్టిక్ రహిత పర్యావరణాన్ని సృష్టించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్లాస్టిక్ నివారణలో మనమే ముందుండేలా కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ పరిరక్షణకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేశారు. పర్యావరణ స్పృహను కలిగించేలా ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర అటవీ శాఖ ముఖ్య కార్యదర్శి నదీం, పీసీబీ సభ్య కార్యదర్శి రవి, పీసీబీ బోర్డు మెంబర్లు సత్యనారాయణరెడ్డి, విజయలక్ష్మీ జయదేవ్, పీసీబీ ఉద్యోగులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

జిమ్‌ట్రైనర్ ఆత్మహత్య

అమీర్‌పేట: ఆర్థిక ఇబ్బందుల కారణంగా జిమ్‌ట్రినర్ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... ఎల్లారెడ్డిగూడకు చెందిన సీహెచ్.నితీష్ (30) అదే ప్రాంతానికి చెందిన ఓ యువతిని ప్రేమించి ఇటీవలే పెళ్లి చేసుకున్నాడు. కొంత కాలంగా అమీర్‌పేట ధరంకరం రోడ్డులో నివాసముంటున్నాడు. స్థానికంగా ఉన్న ఓ జిమ్‌లో జిమ్ ట్రైనర్‌గా పనిచేస్తున్నాడు. బుధవారం సాయంత్రం భార్య వ్యక్తిగత పని మీద తల్లిదండ్రుల ఇంటికి వెళ్లింది. నితీష్ జిమ్‌కు వెళ్లకుండా ఇంట్లోనే ఒక్కడే ఉండిపోయాడు. రాత్రి సతీష్ తల్లి ఫోన్ చేయగా ఫోన్ తీయకపోవడంతో విషయాన్ని పెద్ద కుమారుడు నిహార్‌కు తెలిపింది. వెంటనే సతీష్ భార్యకు ఫోన్ చేసి ధరంకరం రోడ్డులోని ఇంటికి వచ్చారు. లోపల నుంచి గడియ వేసి ఉండటంతో ఎంత సేపు తలుపులు తట్టినా స్పందన లేకపోవడంతో తలుపులు పగులగొట్టి లోపలకు వెళ్లి చూడగా ఫ్యాన్‌కు ఉరేసుకుని వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వగా సంఘటన స్థలానికి చేరుకుని గదిలో నుంచి సతీష్ సెల్‌ఫోన్ తీసుకుని మెస్సేజ్‌లను పరిశీలించారు. వివిధ లోన్ యాప్‌ల ద్వారా రుణాలు తీసుకున్నట్లు గుర్తించారు. అప్పుల బాధతోనే సతీష్ ఆత్మహత్య చేసుకుని ఉండవచ్చని భావిస్తున్నారు.మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ ఆస్పత్రికి తరలించారు.

పనికోసం వచ్చి ఇంట్లో నగలతో పరార్

ఇద్దరిని పట్టుకున్న పోలీసులు

అడ్డగుట్ట: పని కోసం వచ్చి ఇంట్లో నగలు దొంగలించిన ఇద్దరిపై కేసు నమోదు చేసి ఒకరిని రిమాండ్‌కు తరలించిన ఘటన లాలాగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ... విజయపురి కాలనీలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఇటీవల వెంకటేశ్వర్లు అనే వ్యక్తి ఫ్లాట్ కొనుగోలు చేసి కుటుంబంతో కలిసి ఉంటున్నాడు. ఈ క్రమంలో గత నెల 31న అంబర్‌పేట్‌కు చెందిన బోయ రషీదా(32) మరో మైనర్ బాలికతో వచ్చి తాము స్థానికంగా ఉంటామని ఇంట్లో పనిలో చేరారు. అదేరోజు సాయంత్రం వారు పని ముగించుకొని హడావుడిగా ఇంటికి వెళ్లిపోయారు. వారికి సంబంధించి అడ్రస్, ఫోన్ నంబర్లు అడిగినా కూడా తరువాత ఇస్తామని చెప్పి బయటపడ్డారు. కొంత సమయం తర్వాత వెంకటేశ్వర్లు భార్య బెడ్రూమ్‌లోకి వెళ్లి బీరువాలో చూడగా సుమారు 3 తులాల బంగారు ఆభరణాలు కినిపించలేదు. వెంటనే వారు లాలాగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ ఫుటేజీల ఆధారంగా దర్యాప్తు చేపట్టి వారిని అదుపులోకి తీసుకున్నారు. ఆభరణాలు స్వాధీనం చేసుకొని రషీదాను రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.

తార్నాకలో అగ్నిప్రమాదం

లాలాపేట: తార్నాకలోని శ్మశానవాటిక వద్ద ఫుట్‌పాత్‌పై ఉన్న సులాబ్ టాయిలెట్‌లో సాయంత్రం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే స్థానికులు పోలీసులు, ఫైర్‌స్టేషన్‌కు సమాచారం అందించారు. ఫైర్ సిబ్బంది అక్కడికి చేరుకుని ఎగిసిపడుతున్న మంటలను ఆర్పేసారు. ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం కాలేదన్నారు. ఈ ప్రమాదం షార్ట్ సర్క్యూట్‌తో జరిగినట్లు ఫైర్ అధికారులు భావిస్తున్నారు.

పర్యావరణాన్ని దెబ్బతీయకుండా ముందుకు సాగాలి

రాష్ట్రపతి నిలయం వేదికగా ముగిసిన పర్యావరణ అవగాహన శిబిరం



రాష్ట్రపతి నిలయంలో జరిగిన కార్యక్రమంలో పర్యాటక శాఖ అధికారి కృపాకర్, మేనేజర్ డా.రజనిప్రియ

బొల్లారం: ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని బొల్లారంలోని రాష్ట్రపతి నిలయం వేదికగా నిర్వహించిన మూడు రోజుల పర్యావరణ అవగాహన శిబిరాలు గురువారం విజయవంతంగా ముగిశాయి. ఈ ముగింపు కార్యక్రమంలో 10 నుంచి 18 ఏళ్ల విద్యార్థులు, మానసిక విద్యార్థులు కలిపి 1400 మందికి పైగా పాల్గొనడం విశేషం. విద్యార్థుల్లో పరిశోధనా దృక్పథం, సృజనాత్మకతను పెంచే ఉద్దేశంతో డ్రోన్ మేకింగ్, పాటరీ, వెల్త్ ఫ్రం వెస్ట్, ఫ్యాబ్రిక్ పెయింటింగ్, టెర్రకోట జ్యువెలరీ తయారీ, ఫైర్‌లెస్ కుకింగ్ వంటి వివిధ హ్యాండ్స్-ఆన్ వర్క్‌షాప్‌లు నిర్వహించారు. ముగింపు రోజు 200కి పైగా మొక్కలను రాష్ట్రపతి నిలయం ప్రాంగణంలో నాటారు. లన్స్ క్లబ్, వాసవి క్లబ్, యూత్ రెడ్ క్రాస్, సైనిక విభాగాలు తదితర సమష్టి భాగస్వామ్యంతో మొక్కలను నాటారు. పర్యాటక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ శ్రీ కృపాకర్ రావిపాటి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పర్యాటక రంగం పర్యావరణాన్ని దెబ్బతీయకుండా ముందుకు సాగాలి... టూరిజంలో సస్టెయినబుల్ ఆచరణలకే ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. రాష్ట్రపతి నిలయం మేనేజర్ డా. కె.రజనిప్రియా మాట్లాడుతూ... 'భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణం అందించాలంటే మనం కనీస వనరులతో జీవించడం నేర్చుకోవాలని అన్నారు. ఇది నేర్పేందుకు ఈ వర్క్‌షాప్‌లు గొప్ప వేదిక అయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఆకీల్ అహ్మద్, శేఖర్ నాయుడు, బాలరాం తదితరులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యామండలి చైర్మన్‌ను తొలగించాలి

ఉస్మానియా యూనివర్సిటీ: రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొ.బాలక్రిష్టారెడ్డిని పదవీ నుంచి తొలంగించాలని తెలంగాణ విద్యార్థి పరిషత్తు చైర్మన్ (టీజీవీపీ) రాష్ట్ర అధ్యక్షులు నక్క శ్రీశైలం యాదవ్ డిమాండ్ చేశారు. రాష్ట్రంలోని వివిధ సెట్ల పరీక్షల నిర్వహణలో ఉన్నత విద్య మండలి చైర్మన్ విఫలమయ్యారని ధ్వజమెత్తారు. 8 వర్సిటీలలో వివిధ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే 'టీజీసీపీజీఈటీ-2025' నోటిఫికేషన్ ఇంత వరకు విడుదల చేయకపోవడమే దీనికి నిదర్శమని విమర్శించారు. ఎంఏ, ఎంకాం, ఎమ్మెస్సీ, ఇతర పీజీ కోర్సులలో ప్రవేశాలకు తక్షణం నోటిఫికేషన్ విడుదల చేయాలని, లేదంటే ఉన్నత విద్యా మండలి కార్యాలయం ఎదుట ఆందోళన చేపట్టనున్నట్లు హెచ్చరించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం



రాంగోపాల్‌పేట్: ఫుట్‌పాత్‌పై పడివున్న ఓ గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని గోపాలపురం పోలీసులు స్వాధీనం చేసికున్నారు. ఎస్సై వేణుగోపాల్ తెలిపిన వివరాల ప్రకారం... రేతిఫైల్ బస్టాప్ ఎదురుగా ఉన్న అక్షా టిఫిన్ సెంటర్ వద్ద ఫుట్‌పాత్‌పై గుర్తు తెలియని వ్యక్తి అపస్మారక స్థితిలో పడివున్నాడు. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు, 108 సిబ్బంది అక్కడకు చేరుకున్నారు. 108 సిబ్బంది పరిశీలించి అప్పటికే మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడి (50–55) ఒంటిపై నీలం, తెలుపు రంగు గీతల చొక్కా, బూడిదరంగు ప్యాంట్ ఉందన్నారు. మృతదేహాన్ని గాంధీ మార్చురీలో భద్రపరిచారు. మృతుడిని గుర్తిస్తే గోపాలపురం పోలీస్‌స్టేషన్‌లో సంప్రదించాలని పోలీసులు తెలిపారు.

వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరి అదృశ్యం


కుమార్ (ఫైల్)

గాంధీఆస్పత్రి: మూర్ఛ వ్యాధితో బాధపడుతున్న యువకుడు అదృశ్యమైన ఘటన సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలో జరిగింది. చిలకలగూడ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తార్నాక మాణికేశ్వరనగర్‌కు చెందిన గండికోట కుమార్ (29) కూలిపనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. అస్వస్థతకు గురైన స్నేహితుడి తల్లికి చికిత్స చేయించేందుకు ఈనెల 3వ తేదీన గాంధీఆస్పత్రికి వెళ్లి తిరిగి ఇంటికి చేరలేదు. పరిసర ప్రాంతాల్లో గాలించినప్పటికీ ఫలితం లేకపోవడంతో బావమరిది అరవింద్ పోలీసులను ఆశ్రయించాడు. మద్యానికి బానిసైన కుమార్ మూర్ఛ వ్యాధితో బాధపడుతున్నాడని తన ఫిర్యాదులో పేర్కొన్నాడు. మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టామని పోలీసులు తెలిపారు.

మరో ప్రాంతంలో బాలుడు...


ఓర్సు సాయి(ఫైల్)

లాలాపేట: ఓ బాలుడు అదృశ్యమైన సంఘటన ఉస్మానియా యూనివర్సిటీ పోలీసు స్టేషన్ పరిధిలో గురువారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... మాణికేశ్వర్‌నగర్‌కు చెందిన ఓర్సు పార్వతమ్మ (తన కుమారుడు, కోడలు చనిపోగా వారికి ఇద్దరి కుమారులు ఉన్నారు.) రెండో మనుమడు ఓర్సు సాయి(12) ఉదయం 6గంటలకు ఇంటి నుంచి తన స్నేహితులతో కలిసి ఆడుకోవడానికి వెళ్లాడు. ఇప్పటికి తిరిగి రాలేదు. ఈ విషయమై సాయి స్నేహితుడు ధనుష్‌ను అడగగా తాము యాకూత్‌పురాలోని సిమ్మింగ్ పూల్‌కు వెళ్లామన్నారు. ధనుష్ తిరిగి వచ్చాడు కానీ సాయి రాలేదు. ఈ మేరకు ఓయూ పీఎస్‌లో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వాటర్‌ట్యాంకర్ డ్రైవర్‌పై దాడి

అమీర్‌పేట: బీకేగూడకు చెందిన శంకర్ అనే వ్యక్తి వాటర్‌ట్యాంకర్‌ను బుక్ చేసుకోవడంతో శ్రీను అనే డ్రైవర్ ట్యాంకర్ తీసుకొచ్చి ఇంటి ఆవరణలో ఉన్న సంపులో నీటిని పోశాడు. సంపులో నుంచి పైప్ తీసే క్రమంలో నీరంతా కింద పడుతుందని శంకర్ డ్రైవర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఆగ్రహంతో ఊగిపోయిన శంకర్ డ్రైవర్‌పై దాడికి దిగాడు. అదే బస్తీకి చెందిన మరికొందరు వచ్చి కర్రలతో దాడి చేశారని బాధితుడు ఎస్ఆర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా ప్రపంచ పర్యావరణ దినోత్సవం


సెయింట్ మేరీస్ కళాశాలలో మొక్కలతో విద్యార్థులు

రాంగోపాల్‌పేట్: సికింద్రాబాద్‌లోని వివిధ ప్రాంతాల్లో పర్యావరణ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. రెజిమెంటల్‌బజార్‌లోని సెయింట్ మేరీస్ సెంటినరీ కాలేజ్ ఆఫ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో మొక్కలు నాటారు. అలాగే ప్లాస్టిక్ కాలుష్యాన్ని ఓడించండి అనే నినాదంతో ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు పట్టుకుని నినాదాలు చేస్తూ కళాశాల చుట్టు పక్కల ప్రాంతాల్లో ర్యాలీ నిర్వహించారు. పర్యావరణాన్ని కాపాడతామని ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ రెవరెండ్ ఆంథోనీ వినయ్ విద్యార్థులు, ఆధ్యాపకులు పాల్గొన్నారు.

మక్తల ఫౌండేషన్ ఆధ్వర్యంలో...

మక్తల ఫౌండేషన్ ఆధ్వర్యంలో మొక్కల పెంపకంపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. సోమ సుందరం వీధి, మంజు థియేటర్, ప్యాట్నీ సెంటర్‌ల మీదుగా ర్యాలీ నిర్వహించి ఎస్వీఐటీ ప్రాంగణంలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో మక్తల ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు జలంధర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలో..

పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని హెచ్‌పీసీఎల్ ఆధ్వర్యంలో రెజిమెంటల్‌బజార్‌లోని నంబర్ వన్ స్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ కొంత దీపిక పాల్గొని మొక్కలు నాటారు.

200 మొక్కలు నాటిన ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి సిబ్బంది

అమీర్‌పేట: పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని, అందు కోసం అందరూ విరివిగా మొక్కలు నాటాలని ఆస్టర్ ప్రైమ్ ఆస్పత్రి సీఈఓ డా. దేవానంద్ అన్నారు. ప్రపంచ పర్యావరణం దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం సనత్ నగర్ కేఎల్ఎస్‌వై మున్సిపల్ పార్క్‌లో ఆస్పత్రి వలంటీర్లతో కలిసి 200 మొక్కలు నాటారు. మానవాళిని కాపాడే పర్యావరణంతో కూడిన ప్రపంచాన్ని సృష్టిద్దామని పిలుపునిచ్చారు.

పర్యావరణ స్పృహను పెంచాలి...

రాంగోపాల్‌పేట్: పౌరుల్లో పర్యావరణ స్పృహను పెంచాల్సిన అవసరం ఉందని హెచ్‌ఎండీఏ డైరెక్టర్ కే శ్రీనివాస్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఐఎఫ్ఎస్ అధికారి ఏడీ చక్రపాణి తదితర అధికారులతో కలిసి గురువారం సంజీవయ్య పార్కులో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీని కోసం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు, కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్ కార్యకలాపాలను చేపడతామని చెప్పారు. పచ్చదనం,రోగ్యకరమైన హైదరాబాద్ కోసం ప్రతి ఒక్కరు పర్యావరణ పరిరక్షణ కోసం తమ వంతు కృషి చేయాలన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం...

పద్మారావునగర్: ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా గురువారం పారిశుధ్య కార్మికులను సన్మానించారు. న్యూబోయిగూడలోని విండర్స్ అవెన్యూ అపార్టుమెంట్ వాసులు, బీజేపీ నాయకులు మిట్టపల్లి శ్రీనివాస్, మానవ హక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి తదితరులు కలిసి జీహెచ్ఎంసీ సూపర్‌వైజర్ వినోద్, సిబ్బందిని ఘనంగా సత్కరించారు.

ఎస్వీఐటీలో..



కేఎల్ఎస్వై పార్కులో..


రెజిమెంటల్‌బజార్‌లో..


సంజీవయ్య పార్కులో మొక్కలు నాటుతున్న హెచ్ఎండీఏ డైరెక్టర్ శ్రీనివాస్